క్లుప్తంగా

ఎస్పీని కలిసిన డీఎస్పీ వెంకటేశ్వర్లు



ఎస్పీకి పూల బొకే అందిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పుట్టపర్తి టౌన్: పెనుకొండ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను మర్యాద పూర్వకంగా కలిశారు. అందుబాటులో ఉండి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్పీ డీఎస్పీకి సూచించారు.
పుట్టపర్తి: బుక్కపట్నం ఎస్ఐగా క్రిష్ణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల వాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి శాంతిభద్రతలను కాపాడటానికి కృషి చేస్తానని నూతన ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుత్ ఏఈగా విశ్వనాథం

నల్లమాడ: మండల విద్యుత్ ఏఈగా జీ. విశ్వనాథం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గాండ్లపెంటలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ బాలకృష్ణా నాయక్‌ను ఉన్నతాధికారులు గోరంట్లకు బదిలీ చేశారు. రైతులు, విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ఏఈ తెలిపారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కదిరి ఆర్డీఓగా వెంకటసన్యాసి శర్మ

కదిరి: కదిరి ఆర్డీఓగా పాడేరు ట్రైబల్ వెల్ఫేర్ ఎస్‌డీసీగా ఉన్న వేదుల వెంకట సన్యాసి శర్మ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సన్నీ వంశీక్రిష్ణ కావలి ఆర్డీఓగా బదిలీ అయ్యారు. సన్నీ వంశీక్రిష్ణ సార్వత్రిక ఎన్నికల సమయంలో కదిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా అన్ని రాజకీయ పార్టీలతో పాటు కదిరి నియోజకర్గ ప్రజల మన్ననలు పొందారు.
ధర్మవరం ఆర్డీఓగా మహేష్
ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్డీఓగా ఎ.మహేష్‌ను నియమించారు. ప్రస్తుత ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డిని మంగళగిరి సచివాలయ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా మహేష్ అడిషనల్ కమిషనర్‌గా విజయవాడలో పని చేస్తున్నారు.

కదిరి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు



కదిరి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా ఇ.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రాయదుర్గం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ శిరీషను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ


పోలప్ప

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓరిగా బి.వెంకటరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వైఎస్సార్ కడప జిల్లా నుంచి బదిలీల్లో భాగంగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ సునిత, మండల పరిషత్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు నూతన ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.
కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా పోలప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో చిత్తూరు జిల్లా మొలకలచెరువు ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

విధుల్లో చేరిన తహసీల్దార్లు



రెడ్డిశేఖర్, స్వర్ణలత

తలుపుల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నూతన తహసీల్దార్‌గా రెడ్డి శేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.
బత్తలపల్లి: రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అందరూ సహకరించాలని తహసీల్దార్ డి.స్వర్ణలత కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన తహషీల్దార్‌ను పలువురు నాయకులు, డీలర్లు, అధికారులు, వీఆర్ఏలు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఎన్పీకుంట: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ గా ఎస్.దేవేంద్రనాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నల్లమాడ డీటీగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా తహసీల్దార్ నరేంద్రకుమార్‌తో పాటు సిబ్బంది డీటీకి శుభాకాంక్షలు తెలిపారు.

బియ్యంతో మమ!

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- ఇతర సరుకులను పంపిణీ చేయని ప్రభుత్వం
- 15వ తేదీకీ ఇంటికి చేరని నిత్యావసరాలు
- గతంలో 5 వ తేదీలోపే అన్ని ఇళ్లకు సరుకుల పంపిణీ
- ఆందోళనలో కార్డుదారులు


గతంలో ఎండీయూ వాహనంతో చీకిరేవులపల్లిలో పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

అమడగూరు: 'మా ప్రభుత్వం వస్తే కార్డుదారులందరికీ నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తాం'.. ఇదీ కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా బియ్యంతోపాటు మరో సరుకు పంపిణీ చేయడం లేదు. అదీ 15వ తేదీ అయినా బియ్యం అందడం లేదు. నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పాటు, మరోవైపు బియ్యం అందకపోవడంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలతో ప్రతి గ్రామానికి వెళ్లి సరుకులను ఇళ్ల వద్దే పంపిణీ చేసేవారు. ప్రతినెలా 5వ తేదీకల్లా రేషన్ పంపిణీ ప్రక్రియ ముగిసేది. ఇప్పుడు సగం నెలా పూర్తయినా రేషన్ పంపిణీ పూర్తి కావడం లేదు. మండల వ్యాప్తంగా 29 రేషన్ దుకాణాలు ఉండగా 10,420 బియ్యం కార్డులు ఉన్నాయి.

బియ్యంతో సరి..
బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం రేషన్‌షాప్‌ల ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండటంతో పేద ప్రజలంతా దిగాలు చెందుతున్నారు. గత ప్రభుత్వంలో బియ్యం, చక్కెర, రాగి, జొన్నలు, కందిబ్యాళ్లు, బెల్లం, ఇతర సరుకులను పంపిణీ చేయించింది. తద్వారా కార్డుదారులకు నెలకు సరిపడా సరుకులు దాదాపుగా అతి తక్కువ ధరకే ఇంటికి చేరేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. బియ్యంతో పాటుగా ఎప్పుడో ఓ సారి చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

ఎదురుచూడాల్సి వస్తోంది



ప్రభుత్వం ప్రతినెలా పంపిణీ చేసే నిత్యావసర సరుకుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. గతంలో 3, 4 రోజుల్లో సరుకులు ఇంటికి వచ్చేవి. కానీ ఇప్పుడు 15 వ తేదీ అయినా సరుకులు అందడం లేదు. అధికారులను అడిగితే వచ్చినపుడు తీసుకోండి అంటున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే సరుకులనే నమ్ముకుని చాలా మంది కూలీలు బతుకుతున్నారు. రెవెన్యూ అధికారులు 4, 5 రోజుల్లోనే పంపిణీ పూర్తి చేయించాలి.
– నాగరాజు, కందుకూరిపల్లి

అన్ని సరుకులు పంపిణీ చేయాలి



ప్రస్తుతం రేషన్‌షాపుల ద్వారా బియ్యం, అప్పుడప్పుడూ చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు. బయట మార్కెట్‌లో నిత్యావసరాలు ధరలు మిన్నంటుతున్నాయి. అలాంటపుడు ప్రభుత్వమే అన్ని రకాల సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. సంబంధిత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలి.
– బయమ్మ, గుండువారిపల్లి

ఎండీయూ వాహనాల కొరత

మండలంలో గతంలో 6 ఎండీయూ వాహనాలతో నిత్యావసర సరుకులను పంపిణీ చేసేవారు. అయితే ప్రస్తుతం 3 మాత్రమే వాహనాలు ఉండటంతో సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. మండల వ్యాప్తంగా ఉన్న 29 రేషన్‌షాపులకూ పంపిణీ చేయాలంటే కనీసం 15 రోజులు పడుతుంది. ఇక నుంచి తొందరగా పంపిణీ పూర్తయ్యేలా డీలర్లను ఆదేశిస్తాం.
– రామనాథరెడ్డి, తహసీల్దార్, అమడగూరు

ఖాద్రీ ఆలయంలో పూజలకు తరలిరండి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం జరిగే పూజ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రేణులు తరలివారావాలని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ కోరారు. పవిత్రమైన తిరుమల లడ్డూ జంతువుల కొవ్వుతో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు చెప్పడం దారుణమన్నారు. సీఎం పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ ఖాద్రీ ఆలయంలో పూజలు నిర్వహిస్తామన్నారు. పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో రావాలని కోరారు.
ఓడీచెరువు: పవిత్ర తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు అసత్య ఆరోపణలకు నిరసనగా స్థానిక ఆంజనేయస్వామి గుడిలో శనివారం పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.
గాండ్లపెంట: పవిత్ర తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు అసత్య ఆరోపణలకు నిరసనగా స్థానిక గంగాభవానీ ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు.

ఆకతాయిల పని పట్టండి

తలుపుల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్న ఆకతాయిల పని పట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆకతాయిల చేష్టలతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఎంఈఓలకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా నేటికి ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ టీచర్లకు వర్తించడంలేదన్నారు. మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత సబ్జెక్టు టీచర్లు నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబర్‌లో అప్‌గ్రేడ్ పోస్టులలో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారికి అర్బన్ ఎంఈఓగా నియమించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రామకృష్ణనాయక్, అర్బన్ అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి సాయిగణేష్, యూటీఎఫ్ నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామంజనేయులు, హరిశంకర్, ఆంజనేయులు, కుళ్లాయప్ప, అమర్‌నారాయణరెడ్డి పాల్గొన్నారు.
కదిరి అర్బన్: తమ సమస్యలు తీర్చాలని మున్సిపల్ ఉపాధ్యాయులు శుక్రవారం ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డికి వినతపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని, మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి, ఆంజబాషా, సునీల్‌కుమార్, అనిత, మానస, ఉష, ప్రత్యూష పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో 'పీసీఎంఆర్' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. మండలంలోని నాగలూరు వద్దనున్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో శుక్రవారం గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు. అండర్–14 ఖోఖో బాలికల విభాగంలో విన్నర్స్, అండర్–14, అండర్–17 బాలుర విభాగం బాల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా నిలిచారు. హైజంప్, షాట్‌పుట్, డిస్క్, జావెలిన్‌త్రోలో ప్రతిభ కనబరిచి అనంతపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీసీఎంఆర్ పాఠశాల డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా వంద రోజుల వేడుకలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. 2014లో సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువ ద్వారా తాగు, సాగునీరందిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ ఆ హామీ నెరవేరలేదన్నారు. పుట్టపర్తిలోని విమానాశ్రయాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పుట్టపర్తి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, నియోజకవర్గం కార్యదర్శి అంజనేయులు, రైతు సంఘం నాయకులు సహదేవ, కమత కాటమయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ సుదర్శన్

ముదిగుబ్బ: ధర్మవరం ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో కొడవండ్లపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రవల్లిక, అనన్య, తేజ, శిరీష, హర్షకల్పన అండర్–14 ఖోఖోలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం వీరిని హెచ్ఎం శంకర్‌రెడ్డి, పీడీ శాంతలింగం, ఉపాధ్యాయులు అభినందించారు.
జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక
కనగానపల్లి: ఇటీవల రామగిరిలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన పలువురు కనగానపల్లి విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కనగానపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు రాహుల్, ప్రవీణ్, హర్షవర్ధన్, మధు, స్నేహా అనే విద్యార్థులు షటిల్ బాడ్మింటన్, యోగా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమేష్ తెలిపారు. మోడల్ స్కూల్‌కు చెందిన హర్ష, రేవంత్, నాగధనుష్ పరుగు పందెం పోటీల్లో సత్తా చాటారు. చెస్, లాంగ్ జంప్, హైజంప్‌లో నాగేశ్వంత్, చరణ్, రాజేష్, అశోక్, ప్రవీణ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ మాధవరాజులు తెలిపారు. వీరితో పాటు అండర్–14, 17 విభాగం కబడ్డీ పోటీల్లో బాల బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.
రామగిరి: పేరూరులోని అక్షయ–ఈ టెక్నో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కార్పడెంట్ సుదర్శన్, ప్రిన్సిపాల్ భవాని శుక్రవారం తెలిపారు. ఇటీవల రామగిరిలో జరిగిన నియోజక వర్గ స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన కిరణ్‌కుమార్, ఉదయ్‌శ్రీ, సంతోష్ సత్తా చాటినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

మాజీ పాత్రికేయుడి మృతి


తోళ్ల నరసింహులు (ఫైల్)

అమడగూరు: మహమ్మదాబాద్‌కు చెందిన మాజీ పాత్రికేయుడు తోళ్ల నరసింహులు(55) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన సుమారు 15 సంవత్సరాలు వివిధ రకాల పత్రికల్లో విలేకరిగా పని చేశారు. తర్వాత వైఎస్సార్‌సీపీలో చురుకుగా వ్యవహరించేవాడు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మల్లికార్జున (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యకర్త పి.మల్లికార్జున (35) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. పి.మల్లికార్జున కొన్ని నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో భార్య లత తన కిడ్నీ ఇచ్చి కాపాడుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి శ్రీనాథ్, మాజీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి సర్పంచులు, నాయకులు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మల్లికార్జున మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చురుకైన కార్యకర్తను కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం
కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాట దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు ప్రపంచంలోని పర్యాటక ప్రదేశాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డా. స్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.
గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ
చెన్నేకొత్తపల్లి: ఎస్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి నాయక్ మాట్లాడుతూ.. గర్భిణులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం బీజేపీ నాయకులు గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. శ్రీనాథ్, చైతన్య, కిశోర్, చెన్నకేశవులు, శివ, మూర్తి, ప్రదీప్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.
ఇసుక ట్రాక్టర్ పట్టివేత
బత్తలపల్లి: గరిశలపల్లి సమీపంలోని చిత్రావతి నది నుంచి బత్తలపల్లికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.
నేడు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు
చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కనుమ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల వేంకటేశ్వర స్వామి వైభవాన్ని, పవిత్రతను రాజకీయ దురుద్దేశంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఈ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
ఆర్సీపీ జిల్లా కమిటీ రద్దు
కదిరి: రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ(ఆర్సీపీ) జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిశంకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతన కమిటీని నియామకం చేపట్టే వరకూ తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ తీర్మానించినట్లు తెలిపారు.
అభినందన
కదిరి అర్బన్: అండర్ –15 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో దక్షిణ మండల జట్టు తరపున పాల్గొంటున్న కదిరి క్రీడాకారిణి తేజశ్విని, రాష్ట్ర క్రీడాకారిణి అర్షియాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం అభినందించారు. ఈసందర్భంగా ఆయన వారికి షూస్‌తో పాటు క్రీడాదుస్తులు అందజేశారు. క్రికెట్ కోచ్ నజీర్, సాధన పాఠశాల హెచ్ఎం సాదిక్ పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేలు అందించాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: ఎన్నికలకు ముందు అన్నదాత సుఖీభవ కింద ఇస్తామన్న రూ.20 వేలను రైతులకు వెంటనే అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జేవి రమణ తదితరులు మాట్లాడుతూ ఖరీఫ్‌లో కరువు, తుఫానులతో నష్టపోయిన రైతులకు పంటల బీమా, పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వాటిని పూర్తి చేయాలన్నారు. రూ.రెండు లక్షల వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దని, జీఓ 22ను రద్దు చేయాలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి అన్ని రకాల పథకాలను వర్తింపజేయాలన్నారు. పట్టు రైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్‌ను తక్షణమే ఇవ్వాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీటీ ఈశ్వరయ్యకు అందజేశారు. రైతు సంఘం నాయకులు రామక్రిష్ణ, మారుతి, జంగమన్న, ఆదినారాయణ, వెంకటస్వామి, చిన్న పోతులయ్య, వెంకటస్వామి, చంద్రశేఖర్, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ చేయించుకుంటేనే రాయితీలు


ముక్తాపురం రైతు సేవా కేంద్రంలో ఈ–కేవైసీని పరిశీలిస్తున్న ఏడీఏ క్రిష్ణయ్య

కనగానపల్లి: ఈ–క్రాప్ ద్వారా పంటల వివరాలను నమోదు చేయించుకుంటేనే రైతులకు వ్యవసాయ రాయితీలు అందుతాయని ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తాపురం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఖరీఫ్ పంటల నమోదుకు చేస్తున్న ఈ–కేవైసీని పరిశీలించారు. రాయితీ విత్తనాల పంపిణీపై వ్యవసాయ సిబ్బంది, రైతులతో మాట్లాడారు. మండలంలో ఖరీఫ్ పంటల నమోదును దాదాపు పూర్తి చేశామని తెలిపారు. ఇంకా కొంత మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. వారు కూడా ఈ నెలాఖరులోపు చేయించుకోవాలన్నారు. ఈ–క్రాపింగ్ చేయించుకున్న వారికే ప్రభుత్వం నుంచి వ్యవసాయ రాయితీలు, పంట నష్ట పరిహారాలు అందుతాయన్నారు. ఇక ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేయని రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలు అందజేస్తున్నామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రుక్మిణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెనూ ప్రకారం భోజనం అందించండి


భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ

బత్తలపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా పరిషత్ సీఈఓ ఓబుళమ్మ ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. సరుకులు పంపిణీ విషయమై నిర్వాహకులతోనూ చర్చించారు. హెచ్ఎం నాగరత్నమ్మ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, స్కూల్స్ కమిటీ గౌరవ అధ్యక్షులు జక్కంపూటి నాగభూషణ ఉన్నారు.
పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరవు
తాడిమర్రి: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరవని పీహెచ్ఎన్ లక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం డ్రై డే ఫ్రైడే పురస్కరించుకుని వైద్య సిబ్బందితో కలసి ఆమె మండల కేంద్రంలోని పలు వీధుల్లో పర్యటించారు. మురుగు నీటి గుంతలు, డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.
చెన్నేకొత్తపల్లి: దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమకాటుకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం హరియాన్ చెరువు గ్రామంలో ఎస్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు.
బత్తలపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం బత్తలపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె స్వచ్ఛతా హీ సేవ ఆవశ్యకత వివరించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీదేవి, ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు,హెచ్ఎంలు నాగరత్నమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.
నల్లమాడ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా దొన్నికోట ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన , క్విజ్ పోటీలు నిర్వహించారు. సర్పంచ్ రాగినేని సరస్వతి, పంచాయితీ కార్యదర్శి రాంమోహన్ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల కమిటీ చైర్మెన్ వెంకటరమణ, హెచ్ఎం గీత, వైఎస్సార్ సీపీ నేతలు నాగరాజునాయుడు, పెద్దప్పయ్యనాయుడు, వైసీ గంగులప్ప పాల్గొన్నారు.
'చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అతిక్రమించలేదు'
ధర్మవరం రూరల్: తన ఫ్యాక్టరీలో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అతిక్రమించలేదని బత్తలపల్లి మండలం వేల్పుమడుగు వద్ద ఉన్న జేఆర్ సిల్క్ శారీస్ ప్రవేట్ లిమిటెడ్ ఎండీ జింకా రామాంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి పవర్‌లూమ్స్‌లో చీరలను తయారు చేస్తున్నామన్నారు. సంఘానికి చెందిన ఒకరిద్దరు వచ్చి తనిఖీలు చేసుకోవచ్చన్నారు.
ఫారెస్ట్ అధికారులకు జింక పిల్ల అప్పగింత
ధర్మవరం రూరల్: ఆర్.యర్రగుంటపల్లి గ్రామంలో రైతు విజయ్ నరసింహారెడ్డికి చెందిన దానిమ్మ తోటలో నడవలేని పరిస్థితుల్లో వున్న జింక పిల్లను రైతు గమనించి వాటిని పట్టుకున్నాడు. అనంతరం ఆయన అటవీ అధికారులకు అప్పగించారు.